పర్ణశాలపై శీతకన్ను..



కల్యాణమండపం పక్కన ఉన్న షెడ్డులో ఉన్న భక్తులు

వేధిస్తున్న వసతులు, విడిది కొరత

- ఏటేటా పెరుగుతున్న భక్తుల రాక
- అయినా సౌకర్యాల కల్పనపై నిర్లక్ష్యంగా యంత్రాంగం

దుమ్ముగూడెం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి అనుబంధ దేవాలయమైన పర్ణశాలలో ఆలయానికి వచ్చిన భక్తులు సేద తీరేందుకు, విడిది చేసేందుకు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరామనవమికి వచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లపై కేవలం భద్రాచలంలోనే ప్రాధాన్యత ఇస్తున్న అధికారులు పర్ణశాలను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆలయం నుండి ఏటా హుండీ, వేలం పాటల ద్వారా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నప్పటికీ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది.

పట్టింపులేని అధికార యంత్రాంగం..

శ్రీ రామనవమికి పర్ణశాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు ఎలాంటి చర్యలు (వసతులు) తీసుకోకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం. కేవలం వీఐపీల రాకకోసం మాత్రమే భద్రాచలంపైనే దృష్టి పెట్టిన అధికారులు పర్ణశాలకు వచ్చే భక్తులకు కావాల్సిన సౌకర్యాల కల్పనను పట్టించుకోకపోవడం గమనార్హం. శ్రీరామనవమికి భక్తులు పర్ణశాలకు భారీ ఎత్తున వస్తుంటారని అధికారులకు తెలుసు వారి సౌకర్యార్థం తాత్కాలిక వసతులు కూడా ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. పర్ణశాలలో చేపట్టిన ప్రసాద్ పథకం పనులు సైతం నత్తనడకన సాగుతుండటం పనులు వేగవంతంగా చేపట్టడంలో కూడా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

చీకట్లో భక్తులు..



చిమ్మచీకట్లో పర్ణశాల..

ఇదిలా ఉండగా శ్రీ రామనవమి వేడుకలను వీక్షించేందుకు పర్ణశాల విచ్చేసిన భక్తులు విద్యుద్దీపాలు లేకపోవడంతో శుక్రవారం చిమ్మచీకటిలో ఉన్నారు. సుదూర ప్రాంతాల నుండి రామయ్య కల్యాణం వీక్షించడానికి వచ్చిన భక్తులకు అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వారి వాహనాలే గూడు..



వాహనాలనే గూడుగా చేసుకున్న భక్తులు

భద్రాచలం వచ్చే భక్తులంతా పర్ణశాల రామయ్యను దర్శించుకుని గోదావరి అందాలను ఆస్వాదించి సేద తీరేందుకు వస్తుంటారు. కానీ ఇక్కడ భక్తులకు కావాల్సిన వసతులు, కాటేజీలు లేకపోవడంతో భక్తులు తాము వచ్చిన వాహనాల్లోనే గూడులు ఏర్పాటు చేసుకుని, ఆలయ పరసరా ప్రాంతాలలోని చెట్ల కింద సేద తీరుతుండటం అధికారుల కళ్లకు కనపడకపోవడం విశేషం. రామయ్య కల్యాణాన్ని దగ్గర నుండి వీక్షిద్దామని వచ్చిన భక్తులు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కల్యాణమండపంలో, దాని పక్కన ఉన్న రేకులషెడ్డులో తల దాచుకోవడం వసతుల కొరతను తెలియజేస్తోంది. నిత్యం వేల మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుండగా, శని, ఆదివారాల్లో ఈ సంఖ్య రెట్టింపవుతుంది. అయినప్పటికీ భక్తులు నిరాశగానే వెనుతిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంకొన్ని రోజులలో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తారు. అప్పుడు భక్తులు కుటుంబ సమేతంగా పర్ణశాల దర్శనానికి వస్తుంటారు. ఇక్కడ కనీస వసతులు కూడ లేకపోవడంతో నిరాశతో మళ్లీ భద్రాచలం తిరిగి వెళ్లాల్సి వస్తుంది.

క్లుప్తంగా

ఎన్నిసార్లు విన్నా.. తనివి తీరనిది రామాయణం



సీడీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

భద్రాచలంటౌన్: ఎన్నిసార్లు విన్నా తనివి తీరక పోగా, మళ్లీమళ్లీ వినాలనిపించేది రామాయణమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఏఆర్ మ్యూజికల్స్ సంస్థ రూపొందించిన 'రామం భజే' ఆడియో సీడీని శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏఆర్ మ్యూజిక్ బాధ్యులు శ్రీరామ్, రమేష్, హరినాథ్, మూర్తి, అరుణరామ్, దేవీప్రేమ్, వీరభద్రరావు, లక్ష్మీ శివరాంజీ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న జ్యోతిబాపూలే బీసీ బాలుర డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారి ఎస్‌కె.బురాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కామర్స్, తెలుగు పాఠ్యాంశాల్లో ఒక్కొక్కటిగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రఘునాథపాలెంలో ఈ నెల 7న నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల వారు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట-బీజీ కొత్తూరు గ్రామాల నడుమ శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కణితి శివ ఆటోలో మణుగూరు వైపు వెళ్తుండగా మొండికుంట గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో శివకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతనిని ప్రథమ చికిత్స అనంతరం భద్రాచలం తరలించారు.

నేడు నాగినేనిప్రోలు సంత వేలం

బూర్గంపాడు: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం పంచాయతీ సంత వేలంపాటను శనివారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బాలయ్య శుక్రవారం తెలిపారు. ప్రతీ గురువారం నిర్వహించే వారసంతతో పాటుగా పంచాయతీకి చెందిన రెండు షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలంపాట నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

బూర్గంపాడు: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జన్మదిన వేడుకలు మండలంలోని కృష్ణసాగర్ గ్రామంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షురాలు బోడ దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయపూడి నిర్మల, బెజ్జం రాణి, ఎలిజాల కళ, అగ్ని, అంతోటి నిర్మల, నందిని, భూదేవి, రాంచందర్, మోత్కూర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం

ములకలపల్లి: మండలకేంద్రంలో శుక్రవారం బీజేపీ మండలకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ కౌన్సిల్ మెంబర్ అనుమల శ్రీనివాసరావు మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు, ఆయన జీవితాన్ని వివరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్‌నాయక్, శనగపాటి సీతారాములు, పెండ్యాల అప్పారావు, ఊకంటి మధుసూదన్‌రావు, తోట వెంకటేశ్వర్లు, బాణోతు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దమ్మపేట : మండలంలోని మల్కారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో నేడు(శనివారం) అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్కారం 33 కేవీ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : మండలంలోని పెంట్లం గ్రామంలో ఉన్న 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సాయితరుణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటెనెన్స్‌తోపాటు ట్రీకటింగ్ కారణంగా అన్నపురెడ్డిపల్లి, నర్సాపురం, పెంట్లం, మర్రిగూడెం, భాస్కరాపురం, బుచ్చన్నగూడెం, కంపగూడెం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వంతెనల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



దమ్మపేట: పూజలు నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారె

దమ్మపేట: వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత బాధ్యులను ఆదేశించారు. మండల పరిధిలోని పూసుకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ మార్గంలో నిర్మాణంలో ఉన్న వంతెనలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు కొండరెడ్లు నివసిస్తున్న పూసుకుంట గ్రామ శివారులో నూతనంగా మూడు వంతెనల నిర్మాణాల పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, నాయకులు పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్, చల్లగుళ్ల నరసింహారావు, ఎర్ర వసంతరావు, సూరిబాబు తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పూజలు

మండల పరిధిలోని గొర్రెగుట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి హాజరు కాగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ములకలపల్లి: మండలపరిధిలోని సూరంపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమత్ సీతా లక్ష్మణ సపరివార దేవతాసహిత కోదండస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు పూజలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: ఆస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించి ఆర్థికభారం తగ్గించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వంద పడకల ఆస్పత్రిలో వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది కొరతను గుర్తించి వైద్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నూతన వైద్యులను, నర్సులను నియమించేందుకు కృషి చేశానన్నారు. ఆస్పత్రిలో వసతుల సమస్యలపై తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. వేసవికాలం వడదెబ్బకు గురికాకుండా వచ్చే రోగులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ సునీల్, వైద్యులు గౌరీ, మూర్తి సాయి మోహన్, అంజలి, సంజీవరావు, కృష్ణకుమారి, పార్టీ నాయకులు నవీన్, శివ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు

- ఎమ్మెల్యే ఆదినారాయణ



చండ్రుగొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె

చండ్రుగొండ: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా నియోజకవర్గానికి రూ.6.75 కోట్లు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రం చండ్రుగొండలోని అంబేడ్కర్‌నగర్‌లో శుక్రవారం బోరుబావి వేసేందుకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ జలప్రభ కార్యక్రమానికి ఇప్పుడే శ్రీకారం చుడుతున్నామని, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన బోరులు వేసి తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. ఈ నెల 14న బోరులకు మోటార్లు అమర్చి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి, నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, సంకా శంకర్, బడుగు కృష్ణవేణి, రుక్మిణి, దారం గోవిందరెడ్డి, బడుగు శంకర్, ఇమ్రాన్, వసీం, అన్వర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్, కొమురంభీం విగ్రహాల ఆవిష్కరణ

దమ్మపేట: మండలంలోని మందలపల్లి శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులంలో రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, గిరిజన పోరాట యోధుడు కొమురం భీమ్ విగ్రహాలను ఎమ్మెల్యే ఆదినారాయణ ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థులు మత్తే మనోజ్, తాళ్ల దుర్గయ్యలు విగ్రహాలు వితరణగా అందజేయగా ఎమ్మెల్యే జారే, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుకులంలో నూతనంగా ఏర్పాటు చేసిన నీటి బోరును ప్రారంభించారు. అనంతరం గండుగులపల్లి గ్రామంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుకులం జోనల్ ఆఫీసర్ స్వరూప రాణి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జీసీసీ మేనేజర్ పాపారావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం మరువలేనిది



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే తదితరులు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజల సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మండలంలోని లక్ష్మీనగరం ప్రాథమిక పాఠశాలలో కోట్ల గోపాలకృష్ణ జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట శ్రీరామారావు నిర్మించిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలకు కొత్త భవనాలు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని, పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎస్సై వెంకటప్పయ్య, ఎంపీఓ బద్ది రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, కెల్లా శేఖర్, పిలక వెంకటరమణారెడ్డి, వీరేందర్, సందీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు హైమావతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సర్వే



ములకలపల్లి: మాట్లాడుతున్న కనకయ్య

అశ్వారావుపేట: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సర్వేను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 8, 14న పూలే వర్ధంతి, అంబేడ్కర్ జయంతిలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సర్వే రూపంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా మండల, జిల్లా కేంద్రాల్లోని కార్యాలయాల వద్ద ప్రజలను సమీకరించి ఆందోళనలు, ధర్నాలు, నిరశనలు నిర్వహించాలన్నారు. మండల కార్యదర్శివర్గ సభ్యులు ముళ్లగిరి గంగరాజు, జిల్లా కమిటీ సభ్యులు బుడితి చిరంజీవి నాయుడు, మండల కార్యదర్శి సోడెం ప్రసాదు, తగరం నిర్మల, మడిపల్లి వెంకటేశ్వరరావు, కారం సూరిబాబు, నాగేశ్వరరావు, కలపాల భద్రం, దుర్గారావు, తిరుపతమ్మ, మురళి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ములకలపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి పార్టీ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామగ్రామాన పాలన కుంటుపడిందన్నారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు, మాలోతు రావూజా, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి, గొగ్గెల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ పనులకు శ్రీకారం



మణుగూరు రూరల్: పసుపు కొడుతున్న మహిళలు



బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో పసుపు కొట్టే కార్యక్రమం

బూర్గంపాడు: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని రామాలయంలో శ్రీ రామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ క్రతువులో భాగంగా ఆలయంలో పసుపు కొట్టు కార్యక్రమం చేపట్టారు.

మణుగూరు రూరల్: శ్రీ రామనవమిని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించేందుకు శుక్రవారం పసుపు కొట్టే కార్యక్రమంతో కల్యాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, మహాభిషేకం, అలంకరణ, అర్చన, బాలభోగ నివేదనం, తీర్థప్రసాద గోష్టి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


ఐఎన్‌టీఎస్‌ఓ ఫలితాల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో యాజమాన్యం

మణుగూరు రూరల్: ఇటీవల వెలువడిన ఐఎన్‌టీఎస్‌ఓ ఫలితాల్లో గుట్టమల్లారంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆరో తరగతి విద్యార్థి కె.హర్షిత్ బంగారు పతకంతో పాటు లాప్‌టాప్, మెరిట్ సర్టిఫికెట్ కైవసం చేసుకున్నాడు. అంతేకాక వివిధదశల్లో విద్యార్థులు గెలుపొందగా శుక్రవారం వారిని ప్రిన్సిపాల్ యుగంధర్ అభినందించారు. చైతన్య అకాడమి డీన్ భాస్కర్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ కొమరయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆలయ పరిసరాలు శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులోగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం పరిసరాలను ఎట్టకేలకు శుభ్రం చేయించారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'జాతర ముగిసే.. పారిశుద్ధ్యం మరిచే' శీర్షికన వచ్చిన కథనానికి ఆలయ ఈవో సూర్య ప్రకాశ్‌రావు స్పందించి సిబ్బందితో పరిసరాలన్ని శుభ్రం చేయించి, చెత్తాచెదారాన్ని తొలగించారు.

జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో వేడుకలపై కరపత్రాలతో ప్రచారం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14న జరిగే అంబేడ్కర్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రామకృష్ణ, మంజువాణి, సుబ్బలక్ష్మి, సుజాత, జ్యోతి, ఆదిలక్ష్మి, సత్యవతి, సుహాసిని, హంస, వేణి, అనిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో బీజేపీ కార్యకర్తలు, నాయకులపై పోలీసులు పెడుతున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని భవాన్‌దాస్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిరుతపల్లి గ్రామంలో రైతుల ఆత్మహత్యలకు కారణమైన నకిలీ విత్తనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని పక్కదారి పట్టించేలా, బీజేపీ వెంకటాపురం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌పై పోలీసులు కనీస విచారణ జరపకుండా అక్రమంగా ఫోక్సో కేసు నమోదు చేశారన్నారు. రాజశేఖర్ పై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి, నాసిరకం విత్తనాలను అమ్మే వ్యాపారులు, కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మ, బాలునాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యా రవి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాస్, పసుమర్తి సతీష్, నిడదవోలు నాగబాబు, ముత్యాల శ్రీనివాస్, వరప్రసాద్, ములిశెట్టి రామ్మోహన్‌రావు, చెల్లుబోయిన వెంకన్న, అల్లాడి వెంకటేశ్వర్లు, కేశవ్, ముక్తేశ్వరరావు, నిఖిల్, శ్రీను పాల్గొన్నారు.

చేపల వేటకు వేళాయే..



చెరువులో చేపలు పడుతున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: వేసవి కాలం వచ్చిందంటే సాగునీటి చెరువుల్లో నీరు తగ్గిపోవడంతో చేపల వేటకు ఉపక్రమిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని నారాయణపురం గ్రామంలోగల పెద్ద చెరువులో శుక్రవారం ఉదయం నుంచే వలలు, పాత చీరల సాయంతో చేపల వేట సాగించారు. వలల్లో శీలావతి, కొర్రమేను, వాలుగ, రొయ్యలు, బంగారు తీగలు, బొచ్చెలు వంటి రకాల చేపలు చిక్కడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. చెరువు వద్ద కేజీ రూ.150 చొప్పున చుట్టు పక్కల గ్రామాల వారికి విక్రయించారు. దీంతో చెరువు వద్ద శుక్రవారం ప్రత్యేక సందడి నెలకొంది.



భారీ వాలుగలతో..